క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ



కొడవలూరు: మండలంలోని రామాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలోని 75 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, అట్టలు, పలకలు జామెంట్రి బాక్స్‌లు, పెన్‌లను సొసైటీ అధ్యక్షుడు యస్దానిబాషా చేతుల మీదుగా అందజేసి, మాట్లాడారు. పేద పిల్లల జీవితాలను మార్చేది విద్య మాత్రమేనన్నారు. కార్యక్రమానికి సహకరించిన దాతలు యానాదిరెడ్డి, హజరత్ బాబు, గజేంద్రలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హెచ్‌ఎం ఎస్.హరి, సొసైటీ సభ్యులు పఠాన్ రంతుల్లా, షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి



సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ నగరాధ్యక్షుడు, కార్యదర్శి శ్రీనివాసులు, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో అఖిలభారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెలో అన్నిరంగాలకు చెందిన కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలన్న ప్రధాన డిమాండ్లతో సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. అసంఘటిత, రవాణా రంగ, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 9వ తేదీ నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మూలం ప్రసాద్, రాంబాబు, సుధాకర్, సూర్యనారాయణ, కామాక్షమ్మ, రజనీ, బసవయ్య, ఈశ్వరయ్య, రాజ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించిన వ్యక్తుల అరెస్ట్



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు సిటీ: కత్తితో బెదిరించి నగదును ఫోన్ పే చేయించుకున్న ఇద్దరు నిందితులను వేదాయపాళెం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. గత నెల 25వ తేదీ వనంతోపు సెంటర్ వద్ద ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్సర్‌ను ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి, రూ.1000లను ఫోన్ పే చేయించుకున్నారు. దీంతో అతను బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొండాయపాళెం హరిజనవాడకు చెందిన గల్లా విల్సన్, రౌడీషీటర్ గిద్దలూరు గోవర్ధన్ అలియాస్ గోవాలను పడారుపల్లిలో గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కత్తి, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసై ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన ఎస్సై విజయకుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు సిటీ: ఇంటి నుంచి వెళ్లిన భర్త తిరిగి రాలేదని భార్య వేదాయపాళెం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. ఆర్టీఓ కార్యాలయానికి సమీపంలో నివాసం ఉండే అక్షయ్‌కుమార్, నవ్య దంపతులకు ఓ కుమారుడు ఉన్నారు. అటవీశాఖ కార్యాలయంలో పనిచేసే అక్షయ్‌కుమార్ గత నెల 30న ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి తన ఏటీఎం కార్డును తీసుకుని బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నావూరు మార్గంలో మలుపు



ఇనుకుర్తి వద్ద రోడ్డు మలుపు



- రక్తమోడుతున్న రోడ్డు మలుపులు
- హెచ్చరిక బోర్డులేవీ?
- హడలెత్తిస్తున్న నావూరు రోడ్డు

ప్రమాదకరంగా..

పొదలకూరు: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు మలుపులు హడలెత్తిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు మలుపులు తిరుగుతున్న సమయంలో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాటి వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తే చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. నావూరు రోడ్డు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలతో రక్తసిక్తమవుతోంది. పొదలకూరు నుంచి 18 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డులో సుమారు పది ప్రమాదకర మలుపులున్నాయి. ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు మార్గంలో మొత్తం ఏడు గ్రామాలున్నాయి. నిత్యం ఆటోలు, మోటార్‌బైకు రాకపోకలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. రహదారి దెబ్బతిని చాలాకాలం ఆటోలు, ద్విచక్రవాహన చోదకులు మరో మార్గంలో వెళ్లే వారు. ఇప్పుడు పనులు పూర్తి కావడంతో తిరిగి ఇదే మార్గంలో ప్రయాణిస్తున్నారు. ఆటోలు ఎదురుగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటనలున్నాయి. కొందరు యువకులు మితిమీరిన వేగంతో వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాపూరు మార్గం ఇనుకుర్తి జెడ్పీ హైస్కూల్, మర్రిపల్లి వద్దనున్న మలుపులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. కలువాయి రోడ్డు లింగంపల్లి తోపు వద్ద, విరువూరు గ్రామంలో ఇరుకురోడ్డుపై మలుపులు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. వీటికితోడు మెయిన్‌రోడ్లపై స్పీడ్ బ్రేకర్ల వల్ల ద్విచక్ర వాహనచోదకులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కొత్తవారు ఈ ప్రాంతంలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

జెడ్పీ సీఈఓ పర్యటన

మనుబోలు: జెడ్పీ సీఈఓ మోహన్‌రావు గురువారం మనుబోలు గ్రామంలో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 250 గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందులో భాగంగానే పైలట్ ప్రాజెక్ట్‌కు ఎంపికైన మనుబోలును పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. గ్రామంలో 46 శాతం ఇళ్ల నుంచి మాత్రమే చెత్తను సేకరిస్తున్నట్లు తెలిపారు. వంద శాతం ఇళ్ల నుంచి చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీఓ జలజాక్షి, డిప్యూటీ ఎంపీడీఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శి గరుడయ్యకు సూచించారు.



వాటర్ ట్యాంక్ వద్ద పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న సీఈఓ

పలువురికి ప్రసన్న పరామర్శ



శివకుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న ప్రసన్న

కోవూరు: కోవూరులోని వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి తల్లి జెట్టి విజయలక్ష్మి ఇటీవల మరణించారు. ఈ క్రమంలో ఆమె దశదిన కర్మకు మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుమారులు సునీల్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, హరిరెడ్డిలను పరామర్శించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు వేమారెడ్డి శివకుమార్‌రెడ్డి తల్లి సులోచనమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు.



విజయలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసన్న

కూటమి విధానాలతో పెన్షనర్లకు నష్టం

- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(బృందావనం): ప్రస్తుత కూటమి ప్రభుత్వ విధానాలు పెన్షనర్లను నష్టపరిచే విధంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక బీవీనగర్‌లోని పెన్షనర్ల భవనంలో సర్వసభ్య, కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫైనాన్స్ బిల్ 2025తో పెన్షనర్లకు ఎటువంటి పెన్షన్ పెరుగుదల ఉండదని, ఈ విధానాల పట్ల పెన్షనర్లు ఐక్యతగా సాగి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్ పెన్షనర్లకు ఫైనాన్స్ బిల్ 2025తో తలెత్తే సమస్యలను వివరించారు. జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ అధికారి డి.గంగాద్రి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. అనంతరం గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన అసిస్టెంట్ ట్రెజరీ అధికారి అహ్మద్ దంపతులను సన్మానించారు. అలాగే బదిలీ అయిన ట్రెజరీ సీనియర్ అకౌంట్స్ అధికారి యుగంధర్, ఎస్టీఓ అప్రోజ్‌బాషాలను కూడా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత టీచర్ పి.బాబురెడ్డి, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీవీఎస్ మూర్తి, ఉపాధ్యక్షులు గురునాథం, ఖాసీం, గోపాల్, వీరేంద్రనాథ్, కోశాధికారి జె.హజరత్తయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రమణయ్య, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.శ్రీనాథ్, కార్యదర్శి సీహెచ్.రఘునాథ్ పాల్గొన్నారు.



విశ్రాంత ఏటీఓ అహ్మద్ దంపతులను సన్మానిస్తున్న పెన్షనర్లు

వైభవంగా పదహారు రోజుల పండగ



నర్రవాడకు ఊరేగింపుగా వస్తున్న ప్రభ



సన్నిధిలో పొంగళ్లు పెడుతున్న భక్తులు

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆలయంలో పదహారు రోజుల పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ముగిసి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా వెంగమాంబ గర్భగుడిని పూలతో విశేషంగా అలంకరించారు. వెంగమాంబ, గురవయ్య దంపతుల మూలవిరాట్టులతో పాటు ఉత్సవమూర్తులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. వెంగమాంబ దంపతులు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. హోమగుండంలో ఎండుకొబ్బరి వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. నర్రవాడ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పొట్టేళ్ల ప్రభలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేశారు. అలాగే సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, లారీలను ప్రత్యేకంగా అలంకరించుకుని నరవాడకు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి.

దౌర్జన్యంపై కేసు నమోదు

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన షేక్ కాజాబీ రేకులషెడ్‌ను కూలదోసేందుకు ప్రయత్నించిన అదే గ్రామానికి చెందిన బొర్రా పరమేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్కే హనీఫ్ పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేశామని గురువారం తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ మృతికి సంతాపం

మనుబోలు: మనుబోలు పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మాధవి (42) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. అధికారులు, నాయకులు సంతాపం తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కోవూరు: మండలానికి చెందిన మోడేగుంట గ్రామంలో రొయ్యల గుంతల వద్ద వేగూరు గ్రామానికి చెందిన ఏకుల నాగరాజు (50) గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కండలేరులో 32.583 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 32.583 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,060, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

9న ధర్నా

నెల్లూరు (అర్బన్): ఆప్కాస్‌ను రద్దు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించాలన్న ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ ఈనెల 9న ధర్నాను నిర్వహించనున్నట్లు యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సతీష్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధవికి ధర్నాకు సంబంధించి నోటీసును గురువారం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసులు, సంధానీబాషా పాల్గొన్నారు.

అనధికార మద్యాన్ని కొనుగోలు చేయొద్దు

నెల్లూరు సిటీ: పార్టీలు, వివాహాలు, సామూహిక వేడుకలకు కొందరు తక్కువ ధరకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారని, అలాంటి అనధికార మద్యాన్ని కొనుగోలు చేయవద్దని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తుల వద్ద మద్యం కొనుగోలు ప్రమాదకరమన్నారు. నకిలీ మద్యం సరఫరా కావచ్చని తెలిపారు. అలాంటి అనుమానిత వ్యక్తుల వివరాలు తెలిస్తే 14405, 94409 02509 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

దర్గా ప్రాంగణంలో నిరంతర విద్యుత్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రొట్టెల పండగ నేపథ్యంలో దర్గా ప్రాంగణంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అన్నారు. ఆయన బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిరంతర విద్యుత్ సరఫరా కోసం దర్గా ప్రాంగణంలో విద్యుత్‌శాఖ స్టాల్‌ను ఏర్పాటు చేసి 15 మంది డీఈఈలు, 22 మంది ఏఈఈలు, 150 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఆయన వెంట ఈఈ శ్రీధర్, ఈఈ అశోక్, ఏఈ లక్ష్మీ నారాయణ, సిబ్బంది ఉన్నారు.

వసతి గృహాల పరిశీలన

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు గురువారం మహ్మదాపురంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లు, వరదాపురం శ్రీసాయినాథ్ స్కూల్ హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో సౌకర్యాలు, శుభ్రతపై ప్రధానంగా తనిఖీలు చేయడం జరిగిందన్నారు. మంచినీటి సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై నిర్వాహకులతో మాట్లాడినట్లు చెప్పారు. స్నానపు గదులు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వంటగదిని పరిశీలిస్తున్న వైద్యాధికారి

7న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కోవూరు: ఈనెల 7వ తేదీ స్థానిక రుక్మిణి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగనుందని పార్టీ మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి అన్నారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో చంద్రశేఖర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. వారు పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త హాజరు కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాధాకృష్ణారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గ్రామాల్లో పదికి మించి గృహాలను కూడా తిరగడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన ఘనత ఏమీ లేదన్నారు.

లేనిపోని విమర్శలు తగవు

ప్రసన్నకుమార్‌రెడ్డిపై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి లేనిపోని విమర్శలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. గతంలో ఆయన కుటుంబం 120 ఎకరాలను పేదల కోసం దానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రసన్న గత ఐదేళ్లలో గడప గడపకు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, దాదాపు లక్షా పదిహేను వేల నివాసాలను సందర్శించారన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆస్తి, సంపదను సామాజిక సంక్షేమానికి ఉపయోగించిన ప్రసన్నపై అసత్య ఆరోపణలను ఎవరూ సహించరన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డిని విమర్శించే స్థాయి వారికి లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, నాయకులు దినేష్‌రెడ్డి, వేణు, ప్రసాద్, వెంకటరమణారెడ్డి, సుధీర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శివకుమార్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యల ఏకరవు

కొడవలూరు: మండలంలోని రామాపురంలో స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిష్ట వేసిన సమస్యలను ప్రజలు తెలుపుకున్నారు. గ్రామంలోని గ్రావెల్ గుంతల్లో పడి పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని, ఎన్నికల సమయంలో గుంతలకు చుట్టూ కంచె ఏర్పాటుకు హామీ ఇచ్చి ఉన్నందున వేయించాలని కోరారు. గ్రామంలో డ్రెయినేజీ సదుపాయం లేక అవస్థలు పడుతున్నామని దీనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని గిరిజనులకు స్థలాలు మంజూరు చేయడంతో పాటు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న గ్రామస్తులు

డెంగీపై అప్రమత్తత అవసరం

కొడవలూరు: డెంగీపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని తలమంచి ప్రాథమికోన్నత పాఠశాలలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగీపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడిస్ అనే దోమ కారణంగా డెంగీ వ్యాధి సోకుతుందన్నారు. దీని బారిన పడకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త సుబ్బమ్మ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసులు

నెల్లూరులో ట్రాఫిక్ ఆంక్షలు



స్వర్ణాల చెరువు సమీపంలో భక్తుల వాహనాలు

- రొట్టెల పండగ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు
- ఎస్పీ కృష్ణకాంత్



కృష్ణకాంత్, ఎస్పీ

నెల్లూరు సిటీ: రొట్టెల పండగ నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయనున్నట్లు ఎస్పీ కృష్ణకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు పలు మార్గాలను మళ్లించినట్లు వివరించారు. బట్వాడిపాళెం సెంటర్, డీపీఏ జంక్షన్, కేవీఆర్ పెట్రోల్‌బంక్ జంక్షన్, పొదలకూరు రోడ్డు జంక్షన్‌ల వద్ద దర్గా వైపునకు వచ్చే వాహనాలకు తప్పనిసరిగా వెహికల్ పాస్‌లు ఉండాలన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

- ⇒ గూడూరు మీదుగా వచ్చే ఆర్టీసీ బస్సులను అయ్యప్పగుడి సెంటర్ నుంచి ఫ్లైఓవర్ మీదుగా బీవీనగర్, అన్నమయ్య సర్కిల్, ముత్తుకూరు రైల్వే అండర్ బ్రిడ్జ్ ఏసీ మార్కెట్, ఆర్టీసీ డిపోనకు డైవర్ట్ చేశారు.
- ⇒ పొదలకూరు రోడ్డు సర్కిల్ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను డైకస్‌రోడ్డు, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సర్కిల్ నుంచి అయ్యప్ప గుడి సర్కిల్ మీదుగా బీవీ నగర్, ముత్తుకూరు రోడ్డు అండర్ బ్రిడ్జ్, ఏసీ మార్కెట్ మీదుగా ఆర్టీసీ డిపోనకు డైవర్ట్ చేశారు.
- ⇒ జొన్నవాడ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను పుట్టా ఎస్టేట్- ఎస్టీ జోసెఫ్ స్కూల్ మీదుగా బోసుబొమ్మ, గాంధీబొమ్మ, ఏసీ మార్కెట్ మీదుగా ఆర్టీసీ డిపోనకు డైవర్ట్ చేశారు.
- ⇒ బట్వాడిపాళెం నుంచి పోలీసు ఆఫీసు మీదుగా వెళ్లే వాహనాలను మూలాపేట వైపు నుంచి డైవర్ట్ చేశారు.
- ⇒ కేవీఆర్ పెట్రోల్ బంక్ నుంచి డీకేడబ్ల్యూ వైపు వెళ్లే వాహనాలకు అనుమతి లేదు.
- ⇒ 5 నుంచి 10వ తేదీ వరకు నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి లేదు.

పార్కింగ్ ప్రదేశాలివే..

- ⇒ గూడూరు వైపు నుంచి వచ్చే వాహనాలు డీ-మార్ట్ పక్కన పార్కింగ్ చేసుకోవాలి.
- ⇒ విజయవాడ, కావలి, కడప, ఆత్మకూరు, బుచ్చి వైపు నుంచి వచ్చే వాహనాలకు ఎస్వీజీఎస్ కళాశాల గ్రౌండ్స్‌లో పార్కింగ్ ప్రదేశం ఉంది.
- ⇒ జొన్నవాడ వైపు నుంచే వచ్చే వాహనాలకు డీఎస్ఎన్ మినీ ఫంక్షన్ హాల్ ముందు, వెనుక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు.
- ⇒ రాపూరు, పొదలకూరు నుంచి వచ్చే వాహనాలకు ఆలిండియా రేడియో స్టేషన్ వద్ద పార్కింగ్ స్థలం ఉంది.